
నాడు హీరో..
నేడు దర్శకుడు..

2


2
కొండ చిలువ కలకలం

AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in


## ప్రజావాణికి 93 ఫిర్యాదులు



**అక్షరటుడే, ఇందూరు :** ప్రజావాణికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ వినయ్ కృష్ణా రెడ్డి అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి కలెక్టర్ వినతులు స్వీకరించారు. కాగా.. ప్రజావాణికి మొత్తం 93 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, జిల్లా పరిషత్ సీఈవో సాయాగౌడ్, హౌసింగ్ పీ.డీ పవన్ కుమార్, బోధన్ ఏసీపీ శ్రీనివాస్‌లకు విన్నవించారు. ఈ సందర్భంగా వినతులు సమర్పించారు.





## బలవంతంగా భిక్షాటన చేయిస్తే కఠిన చర్యలు

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** చిన్నారులతో బలవంతంగా భిక్షాటన, వెట్టి చాకిరీ చేయిస్తున్న వాళ్లపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని అదనపు డీసీపీ (అడ్మిన్) బస్వారెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం 'ఆపరేషన్ స్మైల్' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు డీసీపీ మాట్లాడుతూ నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో 18 ఏళ్ల లోపు తప్పిపోయిన బాలురు, బాలికలు ఉన్నట్లయితే అలాంటి వారి సమాచారం సేకరించి వారి తల్లి దండ్రులకు అప్పగించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఇందుకోసం ప్రత్యేకంగా జనవరి 1 నుండి 31వరకు ప్రత్యేకంగా 'ఆపరేషన్ స్మైల్' కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీసీఆర్‌బీ సీఐ అంజయ్య, చైల్డ్, ఉమెన్ డిస్టిక్ట్ వెల్ఫేర్ ఆఫీసర్ రసూల్ బీ, చైల్డ్ ఉమెన్ వెల్ఫేర్ ఆఫీసర్ సుదాం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## కళాభవన్ నిర్మాణం పూర్తిచేయాలి



**అక్షరటుడే, ఇందూరు:** నగరంలో నిర్మాణంలో ఉన్న కళాభవన్‌కు నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేయాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ కోరారు. ఈ మేరకు అసెంబ్లీలో సోమవారం ప్రారంభమైన శీతాకాల సమావేశాల్లో జీరో అవర్‌లో మాట్లాడారు. నిజామాబాద్ జిల్లా కళలు, కళాకారులకు, సాహిత్యానికి పుట్టినిల్లు అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో రూ.116 కోట్లతో కళాభవన్‌ను ప్రారంభించారన్నారు. అయితే రూ.50 కోట్లు నిధులు విడుదల చేయడంతో పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కాంట్రాక్టర్‌కు బకాయిలు ఉండడం.. అంచనాలు మారడంతో రూ. 70కోట్లకు పైగా పెండింగ్ బిల్లులు ఉన్నాయన్నారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతి తరహాలో ఇందూరు నగరంలో కళాభారతి నిర్మాణం జరుగుతోందని ధన్‌పాల్ వివరించారు. కానీ దాదాపుగా నాలుగైదేళ్లుగా నిధులు లేక నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయిందన్నారు. వెంటనే కళాభవన్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని సంబంధిత శాఖమంత్రిని కోరారు.

## భీమ్‌గల్ ఆస్పత్రి, మార్కెట్ పనులను పూర్తిచేయాలి: ఎమ్మెల్యే



**అక్షరటుడే, భీమ్‌గల్ :** భీమ్‌గల్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం ప్రారంభమైన అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా జీరో అవర్‌లో ఆయన పలు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. భీమ్‌గల్ మున్సిపాలిటీ పరిధిలో పెండింగ్‌లో ఉన్న 100 పడకల ఆస్పత్రి భవన నిర్మాణం, ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్ వెజ్ మార్కెట్ పనులను వెంటనే పూర్తి చేయాలని ప్రశాంత్‌రెడ్డి కోరారు. గత ప్రభుత్వ హయాంలో భీమ్‌గల్ మున్సిపాలిటీకి 100 పడకల ఆస్పత్రి మంజూరైందన్నారు. ఇప్పటికే 80శాతం పనులు పూర్తయ్యాయని తెలిపారు. కానీ రెండేళ్లుగా పనులు నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే పెండింగ్ బిల్లులు విడుదల చేసి, మిగిలిన రూ. 5 కోట్లు కేటాయించి ఆస్పత్రిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కోరారు. అలాగే ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్ వెజ్ మార్కెట్ నిర్మాణాన్ని గతంలో ప్రారంభించామన్నారు. బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్ పనులను నిలిపివేశారని సభ దృష్టికి తెచ్చారు. వెంటనే బిల్లులు చెల్లించి పనులు పూర్తి చేయాలని కోరారు.

ఇంటర్ ప్రయోగ పరీక్షల్లో ఎలాంటి అవకతవకలు జరగకుండా ఉన్నతాధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టనున్నారు. ఈ విద్యా సంవత్సరం నిర్వహించే ప్రయోగ పరీక్షలకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కెమెరాలు ఉన్న కళాశాలకే పరీక్ష కేంద్రాలు కేటాయించనున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ప్రయోగ పరీక్షలు సజావుగా సాగే అవకాశం ఉంటుంది.

- అక్షరటుడే, ఇందూరు/కామారెడ్డి




# ఇంటర్ ప్రాక్టికల్స్

■ పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ■ ఇంటర్ బోర్డ్ కార్యాలయానికి అనుసంధానం ■ పక్కాగా నిర్వహించడానికి అధికారుల చర్యలు

నిజామాబాద్ జిల్లాలో మొత్తం 56 జూనియర్ కళాశాలలున్నాయి. ఇందులో 16 ప్రభుత్వ, 40 ప్రైవేటు కళాశాలలున్నాయి. ఇందులో సుమారు 50 కళాశాలలకు ప్రయోగ పరీక్షా కేంద్రాలను కేటాయించే అవకాశం ఉంది. అయితే ప్రతి కళాశాల యాజమాన్యం సుమారు 10 నుంచి 15 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. వీటిని హైదరాబాద్‌లోని ఇంటర్ బోర్డు కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేయాలని నిర్ణయించారు. దీంతో పరీక్షలు పకడ్బందీగా జరిగే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. అలాగే సీసీ కెమెరాలు అందుబాటులో లేని కళాశాలల విద్యార్థులను సమీప కళాశాలలో పరీక్షలు రాసే విధంగా చూడాలని జిల్లా అధికారులకు సూచించారు.

### నిబంధనలో మార్పు

సాధారణంగా 50 మందికి పైగా విద్యార్థులు ఉంటే గతంలో అదే కళాశాలకు పరీక్షా కేంద్రం మంజూరు చేసేవారు. కానీ తాజా నిబంధన మేరకు ఈ పద్ధతిలో మార్పులు తీసుకొచ్చారు. జిల్లాలో ఉన్న గురుకులం, మోడల్ కళాశాలలో నిఘా నేత్రాలు ఇంటర్ బోర్డు కంట్రోల్ గదికి అనుసంధానం చేయకపోవడంతో ఆయా కళాశాలలకు ప్రయోగ కేంద్రాలను ఇవ్వలేదు. సమీపంలో ఉన్న ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు.

### ఫిబ్రవరి 2 నుంచి..

ఇంటర్ ద్వితీయ సంవత్సరం, వృత్తి విద్యా కోర్సులకు సంబంధించిన ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు ఫిబ్రవరి 2వ తేదీ నుంచి ప్రయోగ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. అయితే పరీక్షలను మూడు దశల్లో నిర్వహించాలని అధికారులు ప్రతిపాదించినట్లు తెలుస్తోంది.

**కామారెడ్డి జిల్లాలో..** కామారెడ్డి జిల్లాలో మొత్తం 86 జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ఇందులో ప్రభుత్వ, ప్రభుత్వ సెక్టార్ కళాశాలలు 70 ఉండగా 16 ప్రైవేట్ కళాశాలలు ఉన్నాయి. ప్రాక్టికల్ పరీక్షల కోసం 18 ప్రభుత్వ కళాశాలలు, 7 ప్రభుత్వ సెక్టార్ కళాశాలలు, 10 ప్రైవేట్ కళాశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. అన్ని కేంద్రాలలో సీసీ కెమెరాలు బిగిస్తున్నారు. ఇప్పటికే 14 ప్రభుత్వ కళాశాలల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయగా మరికొన్ని చేయాల్సి ఉంది. ప్రైవేట్ కళాశాలలు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాల్సి ఉంది. ఒక్కో ల్యాబ్ కు 3 సీసీ కెమెరాలు పెట్టనున్నారు. నాలుగు ల్యాబ్‌లకు కలిసి 12 సీసీ కెమెరాలు చొప్పున ఏర్పాటు చేయనున్నారు.

### అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలు



జిల్లాలోని అన్ని జూనియర్ కళాశాలల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్న ఆదేశించాం. గతంలో ఇంటర్ బోర్డు ఏర్పాటు చేసేది. కానీ ఈ ఏడాది కళాశాల యాజమాన్యాలే కెమెరాలు బిగించాల్సి ఉంటుంది. జిల్లాలోని ప్రభుత్వ కళాశాలల్లో వీటిని ఏర్పాటు చేశాం. కెమెరాలను ఇంటర్ బోర్డు కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేస్తాం.

– రవికుమార్, డీఐఈవో, నిజామాబాద్



## చైనా మాంజా అమ్మితే కఠిన చర్యలు

**అక్షరటుడే, కామారెడ్డి:** చైనా మాంజా అమ్మినా, వాటిని వినియోగించినా ఏడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.10వేల జరిమానా విధించబడుతుందని ఎస్పీ రాజేష్ చంద్ర తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా పరిధిలో ప్రభుత్వం నిషేధించిన చైనా మాంజా విక్రయాలు, వినియోగంపై పూర్తి స్థాయిలో నిషేధం అమలు చేస్తున్నామన్నారు. రాబోయే సంక్రాంతి పండుగ సందర్భంగా చైనా మాంజా ఎక్కువగా విక్రయించే దుకాణాలు, గోడౌన్లు, మార్కెట్లపై అధికారులు ప్రత్యేక తనిఖీలు చేయనున్నట్లు తెలిపారు. చైనా మాంజా పర్యావరణానికి తీవ్రమైన విపత్తుగా మారడంతో పాటు, ప్రజలు, పక్షుల ప్రాణాలకు ముప్పుగా మారుతుందన్నారు. ఎవరైనా చైనా మాంజాను విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్ లేదా, డయల్ 100, టాస్క్‌ఫోర్స్, సీసీఎస్ సీఐ శ్రీనివాస్ 8712686112కు సమాచారం అందించాలని కోరారు.

## ప్రతిఒక్కరూ రక్తదానం చేయాలి



**అక్షరటుడే, ఇందూరు:** ప్రజలు స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని ఇంటెలిజెన్స్ ఏసీపీ మధుసూదన్ సూచించారు. నగరంలోని రెడ్‌క్రాస్ రక్తనిధి కేంద్రంలో సోమవారం సొసైటీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తోట రాజశేఖర్ జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఇంటెలిజెన్స్ ఏసీపీ మాట్లాడుతూ.. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తోట రాజశేఖర్ 85వ సారి రక్తదానం చేసి అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. తలసేమియా బాధితులకు తన పుట్టినరోజు సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ఛైర్మన్ బుస్సా ఆంజనేయులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ట్రాన్స్‌కో ఏడీఈ తోటరాజశేఖర్, సొసైటీ కో-ఆర్డినేటర్ డాక్టర్ అబ్బాపూర్ రవీందర్, అర్బన్ ఛైర్మన్ నరాల సుధాకర్, బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆకుల ప్రసాద్, బీసీ ఉద్యోగ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు చిట్టి నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కామారెడ్డి జిల్లాలో నాటుబాంబుల కలకలం

**అక్షరటుడే, కామారెడ్డి :** కామారెడ్డి జిల్లాలో నాటుబాంబుల పేలుళ్లు కలకలం రేపాయి. ఈ ఘటన మండలంలోని గర్గుల్‌లో చోటు చేసుకుంది. కాగా.. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.. గర్గుల్ గ్రామానికి చెందిన మొగుళ్ల సాయాగౌడ్‌కు చెందిన పంట చేనులో శనివారం ఉదయం సాయాగౌడ్ తమ్ముడు రామాగౌడ్ నీళ్లు పారించడానికి వెళ్లాడు. ఆ సమయంలో భారీ శబ్దం రావడంతో వెళ్లి చూడగా ఓ కుక్క తలపగిలి మృతిచెందింది. చుట్టుపక్కల చూడగా పొగ రావడాన్ని గమనించి నాటు బాంబులు పేలినట్టుగా గుర్తించారు. గుర్తు తెలియని వ్యక్తులు తమ పంటచేనులో బాంబులు పడేసి ఉండడంతో అది తెలియని కుక్క నోట పట్టుకోగా తలపగిలి మృతి చెందినట్లు అనుమానిస్తున్నారు. తమకు హాని చేయడానికే బాంబులు పడేసి ఉంటారని సదరు రైతు అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ చేనులో బాంబులు పడేసి తమకు హాని కలిగించాలని ప్రయత్నించిన దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని సాయాగౌడ్‌తో పాటు చుట్టుపక్కల రైతులు కోరుతున్నారు. పేలుడు ఘటనకు సంబంధించి పోలీసులు విచారణ జరుపుతున్నారు. అడవి పందుల కోసం ఎవరైనా పెట్టి ఉంటారా.. ? లేదా కావాలని పెట్టారా అనేది పోలీసుల విచారణలో తేలనుంది. ఈ విషయమై దేవుని పల్లి ఎస్సై రంజిత్‌ను సంప్రదించగా.. బాంబులు పేలిన ఘటన నిజమేనని దీనిపై బాధితుడు ఇచ్చిన పిర్యాదు మేరకు విచారణ చేస్తున్నామన్నారు.

## సీనియర్లను చూసి తాము నేర్చుకునేలా మాట్లాడాలి



**అక్షరటుడే, కామారెడ్డి:** అసెంబ్లీకి కొత్తగా వచ్చిన తాము సీనియర్ల మాటలను చూసి నేర్చుకునేలా ఉండాలని.. అలా గౌరవ సభ్యులు మాట్లాడే విధంగా చూడాలని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి అన్నారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా సోమవారం జీరో అవర్‌లో సభ్యులు మాట్లాడే మాటతీరుపై ఎమ్మెల్యే కేవీఆర్ స్పందించారు. సభలో మాట్లాడేటప్పుడు ఎదుటి వారిని గౌరవించేలా విమర్శలు, సద్విమర్శలు ఉండాలని కేవీఆర్ అన్నారు. మాటల విషయంలో సభ్యులను సరైన దారిలో పెట్టాలని కోరారు. ఒకరిమీద ఒకరు మాట్లాడుకునే మాటలు రికార్డుల్లోకి కూడా తీసుకోలేని పరిస్థితి ఉందన్నారు. మీడియా సైతం సీఎంలు, పీఎంలు తమ చిన్ననాటి మిత్రులైనట్లు ఏకవచనంతో సంభోదించే పరిస్థితి రావడానికి కారణం మనమేనని ఎమ్మెల్యే అన్నారు. బూతులు మాట్లాడడం అవలక్షణమని పేర్కొన్నారు. మాజీ సీఎం కేసీఆర్ నుంచి ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి వరకు ఎమ్మెల్యేలు, మంత్రులకు వచ్చే శాసన సభకు మంచి సందేశం ఇవ్వాలన్నారు. మీడియా ముందు మాట్లాడి తమను తాము దిగజార్చుకుంటున్నామన్నారు. సభలో మాట్లాడే విధానంపై మీ పార్టీ సభ్యులకు కూడా చెప్పాలని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఎమ్మెల్యే కేవీఆర్ వ్యాఖ్యలకు బదులిచ్చారు. హుందాతనాన్ని కాపాడేందుకు, తెలంగాణ సంస్కృతిని కాపాడే విషయంలో స్పష్టంగా ముందుకు వెళ్తున్నామని చెప్పారు. తమకు భేషజాలు లేవని, ఎమ్మెల్యే ప్రస్తావించిన అంశాన్ని గౌరవిస్తామన్నారు.

## మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డి పట్టణ సుందరీకరణతో పాటు మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. కామారెడ్డి పట్టణంలోని విద్యానగర్ కాలనీ, చోటా కసాబ్ గల్లీలో చేపట్టనున్న సీసీ రోడ్ల పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కామారెడ్డి పట్టణంలో మౌలిక వసతుల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. విద్యానగర్ రోడ్డు నిర్మాణంతో స్థానిక ప్రజలకు రాకపోకల సమస్యలు తొలగి, వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులు తగ్గుతాయని తెలిపారు. చోటా కసాబ్ గల్లీ ప్రాంతం ఎన్నాళ్లుగానో మౌలిక వసతుల కొరతతో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దశలవారీగా అన్ని సమస్యలను పరిష్కరిస్తున్నామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధిలో ఎక్కడా వెనక్కి తగ్గేది లేదని.. పట్టణం అయినా, గ్రామమైనా సమానంగా అభివృద్ధి జరగాలన్నదే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజల అవసరాలే ప్రభుత్వానికి మార్గదర్శకమని చెప్పారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి జిల్లా కార్యాలయంలో బాధిత కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను షబ్బీర్ అలీ పంపిణీ చేశారు. 82 మంది బాధిత కుటుంబాలకు రూ.50లక్షల విలువ చేసే చెక్కులను అందజేశారు.



## 410 కిలోల ఎండు గంజాయి దహనం..

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** జిల్లాలో వివిధ కేసుల్లో పట్టుబడ్డ గంజాయిని పోలీసులు దహనం చేయించారు. జక్రాన్‌పల్లి మండలం పడకల్‌లో ఉన్న మెడికేర్ సర్వీసెస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బయో మెడికల్ వేస్టేజ్ ప్లాంట్‌లో సోమవారం గంజాయిని కాల్చేశారు. నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలోని 11 పోలీస్ స్టేషన్ల పరిధిలో దాదాపు 410 కేజీల ఎండు గంజాయిని గతంలో సీజ్ చేయగా.. సోమవారం సీపీ సాయిచైతన్య సమక్షంలో దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నామన్నారు. గంజాయిని సమూలంగా అరికట్టేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ (అడ్మిన్) జి.బస్వారెడ్డి, నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకట్ రెడ్డి, సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ రమేష్, సీఐలు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు, బయో మెడికల్ వేస్టేజ్ సర్వీసెస్ ఎండీ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అసెంబ్లీ ముట్టడికి మాజీ సర్పంచ్‌ల యత్నం..



**అక్షరటుడే, మెండోరా:** పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని మాజీ సర్పంచ్‌లు నినదించారు. ఇందు కోసం వారు సోమవారం అసెంబ్లీ ముట్టడి చేపట్టారు. హైదరాబాద్‌కు బయలు దేరిన వీరిని పోలీసులు అడ్డుకున్నారు. గ్రామ పంచాయతీలకు సంబంధించిన పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ బాల్కొండ, మెండోరా తదితర మండలాల నుంచి అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న మాజీ సర్పంచులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనుల నిమిత్తం రూ.లక్షల్లో సొంత డబ్బులు ఖర్చు చేశామని.. వాటి బిల్లులు ఇప్పటికీ విడుదల కాలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థికంగా అనేక ఇబ్బందుల్లో ఉన్నామని కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే తమకు పెండింగ్ బిల్లులు విడుదల చేయించాలని వారు డిమాండ్ చేశారు. అసెంబ్లీకి వెళ్లేందుకు యత్నించిన వారిలో రాజిరెడ్డి (మెండోరా), గంగారెడ్డి (వెల్గటూర్), గంగారెడ్డి (బుస్సాపూర్), బిస్బావద్దీన్ (పోచంపాడ్-మాజీ సర్పంచ్) ఉన్నారని.. వారిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై సుహాసిని తెలిపారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారకుండా ఈ చర్యలు తీసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు.

## పశువులకు నట్టల నివారణ మందుల పంపిణీ



**అక్షరటుడే, ముప్కాల్:** ముప్కాల్ మండలం నల్లూర్, వెంచిర్యాల్ గ్రామాల్లో సోమవారం 1,584 మేకలు, గొర్రెలకు ఉచిత నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. నల్లూర్‌లో సర్పంచ్ గంగాధర్, వెంచిర్యాల్‌లో సర్పంచ్ భర్త నిమ్మల శ్రీనివాస్ చేతుల మీదుగా మందులు పంపిణీ చేసినట్లు పశువైద్యాధికారిణి డాక్టర్ ఆర్.ఉజ్వల తెలిపారు. ప్రతి మూణ్నెళ్లకొకసారి మందులు వాడితే గొర్రెల ఎదుగుదల మెరుగ్గా ఉంటుందని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఉపసర్పంచులు అన్నపూర్ణ, శ్రీనివాస్, జీవాల పెంపకదారులు, గోపాలమిత్ర ప్రణీత్, ఆఫీస్ సబార్డినేట్ బషీర్ తదితరులు పాల్గొన్నారు.



## ఇంటి నంబర్ల కేటాయింపుల్లో పొరపాట్లపై ఫిర్యాదు

**అక్షరటుడే, ముప్కాల్:** మండల కేంద్రంలో దాదాపు 150కి పైగా ఇంటి నంబర్ల అలాట్‌మెంట్ విషయంలో పొరపాట్లు జరిగాయని సర్పంచ్ కొమ్ముల సాయవ్వ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని వార్డు సభ్యులతో కలిసి ఆమె అధికారులను కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ బ్రహ్మదండి చిన్నయ్య, వార్డు సభ్యులు దినేష్, మయూర్, పోశెట్టి, శాంతి, అంజలి, అరుణ, అక్షిత, సర్పంచ్ భర్త కొమ్ముల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# నాడు హీరో నేడు దర్శకుడు

**సాధారణ కుటుంబంలో జన్మించిన ఆ యువకుడు పదో తరగతి నుంచే సినిమా ఇండస్ట్రీకి వెళ్లాలని కలలుకన్నాడు. ఇంటర్ చదివే సమయంలో అవకాశం రాగా కళాశాల యాజమాన్యం సహకారంతో ఇండస్ట్రీలో అవకాశాల కోసం ప్రయత్నాలు కొనసాగించాడు. సినిమాలో నటుడిగా ఛాన్స్ రావడంతో సుమారు 11 సినిమాల్లో నటించాడు. కానీ కొన్ని విడుదల కాకపోవడం.. కొన్నిసినిమాలకు పేరు రాకపోవడంతో.. దర్శకత్వం వైపు ప్రయత్నం చేసి రాణిస్తున్నాడు.**

- అక్షరటుడే, కామారెడ్డి



- సినిమా ఇండస్ట్రీలో రాణిస్తున్న కామారెడ్డి యువకుడు పరమేశ్వర్
- హీరోగా పరిచయమైనా దర్శకత్వంలో రాణింపు
- ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య కథతో దర్శకత్వం

మహారాష్ట్ర నుంచి 40 ఏళ్ల క్రితం వచ్చి కామారెడ్డి పట్టణంలోని గాంధీనగర్‌లో స్థిరపడిన లక్ష్మీబాయిభుజంగరావు దంపతుల కొడుకు పరమేశ్వర్ రావు హివ్రాలే. 1991 జూన్ 28న జన్మించిన పరమేశ్వర్ రావు కామారెడ్డి పట్టణంలోని నాగార్జున హైస్కూల్‌లో పదో తరగతి వరకు చదివాడు. సాందీపని జూనియర్ కళాశాలలో ఇంటర్ చదివాడు. విజయ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ టెక్నాలజీలో బీటెక్ పూర్తి చేశాడు.

### ఇంటర్‌లోనే అవకాశాలు..

సినిమా ఇండస్ట్రీపై మక్కువ ఉన్న పరమేశ్వర్‌కు ఇంటర్ చదివే సమయంలో అవకాశాలు వచ్చాయి. కళాశాల ప్రిన్సిపాల్ బాలాజీరావు మద్దతు ఇచ్చారు. ఇండస్ట్రీ పేరుతో చదువును అశ్రద్ధ చేయొద్దని సూచించడంతో పాటు పరమేశ్వర్ తల్లిదండ్రులను సైతం ఒప్పించారు. దాంతో ఇండస్ట్రీకి వెళ్లడానికి పరమేశ్వర్‌కు మార్గం సులువైంది. అనంతరం 'చిరు గొడవలు' సినిమాతో హీరోగా ఇండస్ట్రీలో అడుగుపెట్టాడు పరమేశ్వర్.

### 11 సినిమాలలో చేసినా..

2015లో 'చిరు గొడవలు' సినిమాతో మొదలైన ఇండస్ట్రీ ప్రయాణం పరమేశ్వర్‌కు మరిన్ని సినిమాల్లో అవకాశం లభించేలా చేసింది. ఆ తర్వాత జాతీయ రహదారి, కుమారి 18 ప్లస్, లావణ్య విత్ లవ్ బాయ్స్, దారి, ఆకాశ దేశాన లాంటి 11 సినిమాలలో హీరోగా నటించాడు. అయితే అందులో ఆరు




మాత్రమే విడుదలయ్యాయి. 'జాతీయ రహదారి' సినిమాలో పరమేశ్వర్ కు ఉత్తమ నటుడిగా అవార్డు కూడా లభించింది. అయినా అనుకున్నంతగా హీరోగా గుర్తింపు రాకపోవడంతో 2017లో నటనకు ఫుల్‌స్టాప్ పెట్టేశాడు. సినిమా దర్శకత్వం వైపు ప్రయత్నాలు ప్రారంభించాడు. పరుచూరి గోపాల కృష్ణ, పూరి జగన్నాథ్, సుకుమార్ లాంటి వారితో సాన్నిహిత్యం పెంచుకుని కథలు రాసుకోవడం ప్రారంభించాడు.

### కన్నడ సూపర్ స్టార్‌తో సినిమా


ఎట్టకేలకు గుమ్మడి నర్సయ్య కథను ఎంచుకున్న పరమేశ్వర్‌కు అందుకు తగిన నటుడు దొరకడం కష్టంగా మారింది. ప్రజల్లో సినిమా వెళ్లాలంటే పెద్ద నటులు అవసరమని భావించి అగ్ర కథానాయకులకు కథను వినిపించగా బాగుంది అని చెప్పినా కాల్ షీట్స్ మాత్రం ఇవ్వలేకపోయారు. దాంతో కన్నడ సూపర్ స్టార్ డా.శివరాజ్ కుమార్‌కు కథ వివరించగా అందులో నటించడానికి ఆయన ఒప్పుకున్నాడు.

### ఇల్లందు మాజీ ఎమ్మెల్యే జీవిత చరిత్రతో..

దర్శకత్వం వైపు దృష్టి సారించిన పరమేశ్వర్ అనేక కథలను అనుకున్నాడు. ఈ క్రమంలోనే ఐదు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి సైకిల్‌పై అసెంబ్లీకి వెళ్లిన ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య గురించి తెలుసుకున్నాడు. జీతం తప్ప ఒక్క రూపాయి ఆశించని ఆయనపై సినిమా తీయాలని సంకల్పించాడు. నేరుగా గుమ్మడి నర్సయ్యను కలువగా ఆయన మొదట ఒప్పుకోలేదు. ప్రజల కోసం నిస్వార్థంగా పని చేసిన వ్యక్తి చరిత్ర ఈ సమాజానికి తెలియాల్సిన అవసరాన్ని వివరించగా తన సీపీఐ పార్టీ అనుమతితో ఆయన ఒప్పుకున్నారు.

దాంతో మిగతా తారాగణం మొత్తాన్ని ఎంచుకుని సినిమాను ప్రారంభించాడు. గత అక్టోబర్ నెలలో గుమ్మడి నర్సయ్య టైటిల్‌తో టీజర్ కూడా విడుదల చేశారు. ఐదారు రోజుల పాటు షూటింగ్ చేసి నిలిపివేశారు. జనవరి 20 తర్వాత రెగ్యులర్ షూటింగ్ మొదలుపెట్టనున్నారు.

### టాలెంట్ ఉన్నవారికి అవకాశాలున్నాయ్..




సినిమా ఇండస్ట్రీపై ఫ్యాషన్‌తో ఇక్కడికి వచ్చాను. హీరోగా చేసినా అనుకున్నంతగా ప్రజల్లోకి వెళ్లలేద. దాంతో నా ఆశయమైన దర్శకత్వం వైపు అడుగుపెట్టాను. గుమ్మడి నర్సయ్య కథ ఐదేళ్ల కష్టం. త్వరలో రెగ్యులర్ షూటింగ్ స్టార్ట్ చేస్తాం. సినిమా ఇండస్ట్రీలో టాలెంట్ ఉన్నవాళ్లకు అవకాశాలకు కొదవ లేదు. డబ్బు సంపాదన కోసం అయితే ఇండస్ట్రీకి కాకుండా ఇతర మార్గాలు చూసుకోవాలి. ఇక్కడ ఎదగాలంటే హార్డ్ వర్క్, ఓపిక కావాలి. అదృష్టం కలిసి రావాలి. **- పరమేశ్వర్ హివ్రాలే, దర్శకుడు**



## సీసీరోడ్లు, డ్రెయినేజీ పనులకు భూమిపూజ

**అక్షరటుడే, ఆర్మూర్:** డీకంపల్లి గ్రామంలో సోమవారం సీసీ రోడ్లు, డ్రెయినేజీలకు సర్పంచ్ మాచర్ల చిన్నయ్య భూమి పూజ చేశారు. ఎస్సీ సబ్ ప్లాన్ కింద విడుదలైన రూ.10 లక్షల నిధులతో ఈ కార్యక్రమం ప్రారంభించారు. ఈసందర్భంగా సర్పంచ్ మాచర్ల చిన్నయ్య మాట్లాడుతూ.. గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధికి పంచాయతీ ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో సీసీ రోడ్లు, డ్రెయినేజీ పనులను వేగవంతంగా పూర్తి చేస్తామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ జినిగిరి రాజేందర్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ పార్టీలో సర్పంచ్ చేరిక

**అక్షరటుడే, ఆర్మూర్**: నందిపేట మండలం లక్కంపల్లి సర్పంచ్ బొల్లపల్లి సంతోష్ గౌడ్‌తో పాటు పాలకవర్గం కాంగ్రెస్‌లో చేరింది. ఈ సందర్భంగా ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి పొద్దుటూరు వినయ్ కుమార్ రెడ్డి సోమవారం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వినయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామంలోని మురికి కాల్వలు, సీసీ రోడ్లు, విద్యుత్ స్తంభాలు, కుల సంఘాలకు సంబంధించిన భవనాలను త్వరలోనే ప్రభుత్వం నుండి నిధులు తెచ్చి గ్రామాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తామన్నారు. సర్పంచ్‌తో పాటు ఉప సర్పంచ్ పస్క నవ్యత, వార్డు సభ్యులు గొల్లపల్లి సురేష్ గౌడ్, మాణిక్యం శ్రీకాంత్, కొమర ఇంద్ర, పస్కా ప్రవీణ్ కుమార్, కల్లెడ సునీత, పుండు ప్రమీల, గోసం లక్ష్మి తదితరులు పార్టీలో చేరారు.

## ఆలూర్ జీపీలో మౌలిక వసతుల కల్పనకు కృషి



**అక్షరటుడే, ఆర్మూర్:** ఆలూర్ పంచాయతీ పరిధిలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయనున్నట్లు సర్పంచ్ ముక్కెర విజయ్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం జీపీ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై ఏకగ్రీవ తీర్మానాలు చేసి ఆమోదించారు. గ్రామంలో ఎవరు మృతిచెందినా వారి అంత్యక్రియల నిమిత్తం కుటుంబాలు జీపీ ట్రాక్టర్ వినియోగించుకునే విధంగా తీర్మానం చేశారు. ఈ నిర్ణయం పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఊరటనిస్తుందని సభ్యులు అభిప్రాయపడ్డారు. అలాగే నూతన ట్రాలీ, ఆటో కొనుగోలు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పద్మ మోహన్, వార్డ్ మెంబర్లు ప్రవీణ్, రాము, భోజన్న, రమ్య, మౌనిక, శిరీష, నరేష్, రంజిత్, మహేష్, సాయిలు, మల్లేష్ పంచాయతీ కార్యదర్శి రాజలింగం, కరాబర్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు సరికాదు




**అక్షరటుడే, గాంధారి:** బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా సోమవారం మండల కేంద్రంలో హిందూ సంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు. మండల కేంద్రంలోని శివాజీ చౌరస్తా నుంచి హిందూ సంఘాల సభ్యులు ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో ఉన్న హిందువులపై దాడులు చేయడంతో పాటు, అమాయకులైన వారిని చంపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచంలో ఏ దేశంలోనైనా సరే హిందువులపై దాడులు జరిగితే సహించేది లేదన్నారు. హిందువులందరూ ఐక్యంగా ఉండి, మతోన్మాద శక్తులను ఎదుర్కోవాలని హిందూ సంఘాల సభ్యులు అన్నారు. కార్యక్రమంలో శివదత్త సేవాసమితి సభ్యులు, అయ్యప్ప సేవా సమితి సభ్యులతో పాటు, బీజేపీ నాయకులు, యువజన సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## మోస్రాలోని పెద్దమ్మగుడిలో చోరీ

**అక్షరటుడే, బాన్సువాడ:** వర్ని పోలీస్ స్టేషన్ పరిధిలోని మోస్రాలోని పెద్దమ్మ గుడిలో ఆదివారం చోరీ జరిగింది. గ్రామంలోని పెద్దమ్మ గుడి గేట్‌కు వేసిన తాళాన్ని గుర్తుతెలియని వ్యక్తులు పగులగొట్టి ఆలయంలోకి ప్రవేశించారు. ఆలయంలో ఉన్న విగ్రహానికి ఉన్న వెండి కిరీటం, సుమారు 6 గ్రాముల బంగారు పుస్తెలను చోరీ చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వర్ని పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. అయితే ఈ చోరీలో పురోగతి సాధించినట్లు తెలుస్తోంది. ఇద్దరు నిందితులను హైదరాబాద్‌లో పట్టుకున్నట్లు సమాచారం.

## తైక్వాండోలో రాణిస్తున్న ఆద్రితి..



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** తైక్వాండోలో అద్భుతాలు చేస్తూ దూసుకుపోతోంది ఈ క్రీడాకారిణి. ప్రతిభ ఉంటే వయస్సుతో సంబంధం లేకుండా విజయాలు సాధించవచ్చని నిరూపిస్తోంది. కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలం బొల్లారం గ్రామానికి చెందిన అశోక్ గౌడ్, నీరజ కుమార్తె ఆద్రితి నిజామాబాద్‌లోని ఇంద్రాణి స్కూల్‌లో రెండో తరగతి చదువుతోంది. చిన్నారుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు.. వారి ఆత్మ సంరక్షణ చేసుకునేందుకు తండ్రి అశోక్ గౌడ్ చిన్నతనం నుంచే తైక్వాండోలో తన కూతురికి శిక్షణనిప్పిస్తున్నారు. ఆద్రితి తన మాస్టర్ శిక్షణలో పలు జిల్లాస్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ చూపుతోంది. గచ్చిబౌలిలో నిర్వహించిన తైక్వాండో ఛాంపియన్‌షిప్ సబ్ జూనియర్ కేటగిరి 20 కిలోల విభాగంలో ఆద్రితి ప్రతిభ చూపింది. తన ప్రతిభతో పంచ్‌లు విసిరి బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా బంగారు పతకం సాధించిన చిన్నారిని తెలంగాణ తెక్వాండో అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ ప్రవీణ్ కుమార్ అభినందించారు. చిన్నారి రాష్ట్రస్థాయిలో రాణించడంపై తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. క్రీడల్లో మరింతగా రాణించాలని ఆకాంక్షించారు.

## గండి మాసానిపేట్‌లో కొండచిలువ కలకలం



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలోని గండి మాసానిపేట్ శివారులో కొండచిలువ కలకలం సృష్టించింది. పొలం పనులకు వెళ్తున్న రైతులకు కొండచిలువ కనిపించడంతో భయాందోళనకు గురయ్యారు. చిన్నపిల్లలు సంచరించే ప్రాంతంలో కొండచిలువ రావడంతో దానిని తాడుతో కట్టి అటవీప్రాంతంలో వదిలిపెట్టారు.

## నగరంలో చైన్ స్నాచింగ్..

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నగరంలో సోమవారం ఉదయం చైన్ స్నాచింగ్ ఘటన కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని మూడో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల సుభాష్ నగర్ ప్రాంతంలో ఉదయం సమయంలో ఓ మహిళ ఇంటి ముందు చెట్లకు పూలు కోస్తుండగా.. ఇద్దరు దుండగులు బైకుపై వచ్చారు. ఈ క్రమంలో సదరు మహిళ మెడలో నుంచి చైన్‌ను లాక్కుని బైకుపై పరారయ్యారు. దీంతో బాధితురాలి కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మూడోటౌన్ ఎస్సై హరిబాబు, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సీసీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాగా.. రెండు తులాల బంగారం చైన్‌ను దుండగులు ఎత్తుకెళ్లినట్లు బాధితురాలు తెలిపింది.



## ఇళ్లలోకి చేరుతున్న నిజాంసాగర్ నీరు

**నిజాంసాగర్ 9వ డిస్ట్రిబ్యూటరీ కాలువ నుంచి విడుదలైన నీరు మండలంలోని దుంకుడు మోరి తండాలో ఇళ్లలోకి చేరింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలువలో వ్యర్థాలు, మట్టి పేరుకుపోవడంతో గ్రామం వైపు వచ్చాయి. ఈ క్రమంలో తండాలోని పలువురి ఇళ్లలోకి నీరు చేరి గృహోపకరణాలు, నిత్యావసర సామగ్రి తడిసిపోయాయి. కాలువను వెంటనే శుభ్రం చేసి, నీటి ప్రవాహాన్ని సక్రమంగా మళ్లించాలని తండావాసులు కోరుతున్నారు.**

- అక్షరటుడే, బాన్సువాడ